# చూపుల్లో తలపుల్లో

## కెప్టెన్ షేక్ మౌలాలి

"ఏమండీ' మనం ఇల్లు మారదామా' అంది వనజ ఆఫీసు నుండి వచ్చిన భర్తకు కాఫీ అందిస్తూ

ఎందుకో తెల్సుకోవచ్చా' అన్నాడు సూర్యం కాఫీ సిప్ చేస్తూ

నాకెందుకో ఇక్కడ ఉండాలనిపించడం లేదండీ' ఇల్లు మారితేనే మంచిదనిపిస్తుంది' అన్నది ఎదురుగా కుర్చీలో కూర్చొని తాను కూడా కాఫీ తాగుతూ

ఇది ఇండిపెండెంట్ హౌస్ అద్దె కూడా ఎక్కువేమీ కాదు కుళాయి బావి రెండూ ఉన్నాయి నా ఆఫీసుకు కూడా చాల దగ్గర చక్కగా అలంకరించుకోడానికి పెరడు నిండా నీకు బోలెడు పూలు ఇంటి యజమానులు ఇబ్బంది పెడుతున్నారనుకోవడానికి వాళ్ళసలు ఈ ఊళ్ళోనే ఉండడం లేదు ఈ ఇల్లు కావాలని సెలక్ట్ చేసింది కూడా నువ్వే' మూడు నెలలు కూడా ముగియక మునుపే ఇల్లు మారదా మనడానికి గల కారణం తెలుసుకోవచ్చా బామామణీ' అన్నాడు సూర్యం ఖాళీ కప్పు క్రిందపెడుతూ

వనజ ఏ సమాధానం ఇవ్వకుండా కాలి బొటన వేలిని నేలకేసి రాస్తూ చూపు క్రిందికి వాల్చింది

ఏమిటో ఆ ఆలోచన' అన్నాడు సూర్యం

సమాధానం శూన్యం

సూర్యం లేచి లోనకు వెళ్ళి బట్టలు మార్చుకు వచ్చాడు

వనజ అలాగే కూర్చొని దీర్ఘాలోచనలో పడిపోయింది

అరె' ఏమిటి వనజా ఆ కన్నీళ్ళు' అసలేమయిందో చెప్పు అలాగే' నీ ఇష్టం ప్రకారం ఇల్లు మారదాము' అన్నాడు

అనుకోని ఈహరాత్పరిమాణానికి వనజ త్రుళ్ళిపడి కళ్ళు తుడుచుకుంది

ఇక్కడ కంటె వెనుక పెరడులో చల్లగా ఉంటుంది అక్కడ కూర్చుందాం పద' అనడంతో వనజ లేచింది

బావిని ఆనుకొని కూర్చున్నాడు సూర్యం తులసి కోటకు ప్రక్కగా కూర్చుంది వనజ

మరేం లేదండి' ఆ ఎదురింటాయన ఎప్పుడూ నాకేసి అదో విధంగా చూస్తుంటాడండి' అంది వనజ తలదించుకొని

అంటి లెక్చరరు శంకరరావా' అన్నాడు సాలోచనగా సూర్యం

అవునన్నట్లు తలాడించింది వనజ

యాభయి పడిలో పడ్డ శంకరరావుకి ఇదేం పాడు బుద్ధి పైగా టీచరుగా ఆయనకు ఊళ్ళో మంచి పేరుంది సతతమూ విద్యార్థినీ విద్యార్థుల మధ్య మసలే ఉపాధ్యాయులు ఇలా ప్రవర్తించడం మంచిదికాదు' వనజ అబద్ధం చెప్పదు ఎన్నాళ్ళ నుండి ఈ వ్యథ అనుభవిస్తుందో' ఆలోచనలో పడ్డాడు సూర్యం

రాత్రి భోజనం ఇద్దరికి సరిగా రుచించలేదు మొత్తం మీద అయిందనిపించారు ఇద్దరికీ కడుపులో చేయి పెట్టి దేవినట్లుగా అనిపించింది రాత్రంతా సరిగ నిద్ర పట్టలేదు

మరునాడు సూర్యం ఆఫీసులో ఏ ఫైలు తెరచినా బట్ట తలతో నెరసిన గడ్డంతో లావుపాటి కళ్ళద్దాలతో శంకరరావు ముఖం ఎక్కిరిస్తూ కన్పించింది ఫైలు మూసి కూర్చుంటే కన్నీటి బిందువులతో వనజ సాక్షాత్కరించింది లంచ్ బాక్స్ తెరచి నోట్లో పెట్టుకున్నాడు చేదుగా ఉన్నట్లని పించింది అంతా కుక్కకు పడేసి బాక్స్ బ్యాగ్‌లో



పడేశాడు తల బరువుగా కళ్ళు వేడిగా, నరాలన్నీ బలహీనంగా ఉన్నట్లనిపించాయి వేడి నిట్టూర్పుల మధ్య మరునటి రోజుకు సెలవు చీటి రాసి పర్మిషన్ తీసుకొని గంట ముందుగా ఇంటికి బయలుదేరాడు

ఇల్లు చేరి స్నానం చేసే్తనే గాని సూర్యానికి తాపం తగ్గలేదు

పెరట్లో చేరి భార్యాభర్త కాఫీ తాగుతూ కూర్చున్నారు

ప్రతి ఇంటికి ఏదో రకమయిన ఇబ్బంది ఉంటుంది వనజా! ఇబ్బందిని మనం సమస్యగా భావించకూడదు ఇబ్బంది గాని లేక సమస్యగాని సావకాశంగ పరిష్కరించే మార్గం ఆలోచించాలి భీతి చెంది పారిపోతే ప్రయోజనం శూన్యం అంతగా ఇక్కడ మనం ఉండలేనప్పుడు తప్పక ఇల్లు నీ ఇష్ట ప్రకారమే ఖాళీ చేద్దాం! అన్నాడు సూర్యం

ఈ ఇంట్లో మనం చేరినప్పటి నుండి ఆయన అనుక్షణం నా వైపే చూడడానికి ప్రయత్నిస్తుంటాడండీ! బాగా గమనించి ఆలోచించే మీతో చెప్పాను ఇందులో నా తొందరపాటు ఏమాత్రం లేదండీ! అంది వనజ

నిజమే! కాని తీరా ఇల్లు మారాక అక్కడ ఇంతకంటె పెద్దచిక్కు ఉత్పన్నం కావచ్చు! మరో మాట ఇది అద్దె ఇల్లు కనుక మారడానికి ప్రయత్నించవచ్చు కాని సొంత ఇల్లు అయితే అది సాధ్యమయ్యే విషయం కాదు కదా! పొరుగు వాడికి భయపడి లోకంలో ఎవ్వరూ ఇల్లు అమ్ముకోరు పోనీ అతను అలా ప్రవర్తించడానికి ఏదయినా కారణముందా! అడిగాడు

వనజ పెదవి విరచి తల అడ్డంగా తిప్పింది

కొంచెం సేపు ఇద్దరూ మౌన ముద్రలో పడ్డారు

తిరిగి సూర్యం అన్నాడు – పోనీ అతను అలా ప్రవర్తిస్తున్నాడని అతని ఇల్లాలిపై నేను దృష్టి కేంద్రీకరించడం అంత సబబు సభ్యత కాదు నేనే స్వయంగా అతని దగ్గరకు వెళ్ళి 'నీ ప్రవర్తన బాగా లేదు మార్చుకో' అంటే అనవసరపు రాద్ధాంతం

# చూపుల్లో అంతర్యం

కావచ్చు! నాకో ఆలోచన స్ఫురిస్తుంది ఆఫీసుకు రేపు సెలవు కూడా పెట్టాను తెల్లారిన తర్వాత చెప్తాను, పని నీ వలననే సానుకూల్యమవుతుంది ప్రయత్నించి చూద్దాం!

ఇద్దరి హృదయాలు కొంత తేలికయ్యాయి రాత్రి గడిచింది

వనజ యథాప్రకారం తొమ్మిదయ్యేసరికి వంట కానిచ్చింది

ఇద్దరూ వరండాలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ ఎదురింటికేసి కన్ను వేసి ఉంచారు తొమ్మిదిన్నర అయ్యేసరికి శంకరరావు చేతిలో పుస్తకాలతో కాలేజీకి బయలుదేరాడు

పది నిమిషాలు వ్యవదానం ఇచ్చి వనజ వెళ్ళి ఎదురింటి తలుపు తట్టింది


తలుపులు తెరచుకున్నాయి వనజ లోన అడుగు పెట్టింది సూర్యం చూపు శంకరరావు ఇంటి గుమ్మం మీదనే కేంద్రీకరించింది వాకిలికి కట్టిన కర్టన్ రెపరెపలాడుతోంది చాలా జాగ్రత్తగా చెవులు నిక్కించి వినడానికి మరీ ప్రయత్నిస్తున్నాడు. కాని ఏమాత్రం మాటలు వినిపించడం లేదు

గంటన్నర గడిచింది వనజ బయటకు రాలేదు సూర్యానికి గుండెదడ మొదలయి తల తిరుగుతోంది

శంకరరావు భార్యతో సూక్ష్మంగా విషయం అందించి వెంటనే రమ్మని వనజకు చెప్పి పంపించాడు సూర్యం పోనీ ఏదయినా ఘర్షణ మొదలయిందా అంటే, వాతావరణం చాల ప్రశాంతంగా ఉన్నట్లనిపించింది

సూర్యం చూపంతా ఎదురింటి కర్టన్ మీదనే ఉంది

సూర్యుడు నెత్తి మీదకు వచ్చాడు గాలి దారాళంగ వీస్తున్నప్పటికి సూర్యానికి చెమటలు పట్టసాగాయి




ఇంతలో నిండు పున్నమ ముఖంతో నవ్వుతూ చేతుల్లో రవిక గుడ్డ అరటి పళ్ళు తాంబూలంతో వనజ ఎదురుగా వచ్చి కూర్చుంది

చెమటలు తుడుచుకున్న సూర్యం ఏమిటన్నట్లు ఆమె కళ్ళలోకి చూశాడు

"నేను కొంత తొందర పడ్డాననిపిస్తుందండీ! ఎదురింటావిడ నన్ను సాదరంగా లోనికి పిల్చి ఇల్లంతా చూపించింది ఆమె చిన్ననాటి నుండి అన్ని వివరాలు చెప్పింది తర్వాత వివాహం అయినప్పటి నుండి అన్ని ఫోటోలు ఆల్బమ్‌లు చూపించింది

వారికి ముగ్గురు సంతానమట పెద్దబ్బాయి అమెరికాలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు రెండో తను ఆర్మీలో మేజరుగా పని చేస్తున్నాడు

తర్వాత వారికి ఒక కుమార్తె కలిగింది ఆమెను ఎం డి చదివించారు

గత సంవత్సరం ఇద్దరు దంపతులు కుమార్తెతో సహా హరిద్వార్‌లో కుంభమేళా దర్శించడానికి వెళ్ళారు

అప్పుడు వార్తా పత్రికలలో కూడా ఫోటోలతో సహా వివరాలు వచ్చాయి కదా! అక్కడ జరిగిన త్రొక్కిసలాటలో ఎందరో అశువులు బాశారు అప్పుడు తల్లిదండ్రులను రక్షించుకొనబోయి పాపం ఆ అమ్మాయి ప్రాణాలు పోగొట్టుకుంది

ఎదురింటి పిన్నిగారు కళ్ళ నీళ్ళు పెట్టుకొని చెబుతూ ఆ అమ్మాయి ఫోటో చూపించింది

ఏమండీ! నిజంగా ఆ ఫోటో అచ్చు నాది లాగానే ఉందండీ! మనిషిని పోలిన మనుషులుంటారంటారు కదా! ఇదేనేమో!

మనం ఈ ఇంట్లో చేరినది మొదలు శంకరరావు గారు పిన్నిగారితో నన్ను గురించి చెప్తూ గతించిన తన కూతురు స్మృతికి వస్తుందంటారట! ఆమె నాతో ఆ విషయం చెబుదామనుకుంటుండగనే మూణ్ణెల్లు గడిచాయట

మా బిడ్డ నీ రూపంలో ఈ రోజు నా ఇంటికి వచ్చిందమ్మా అంటూ భోజనం చేయమని బ్రతిమలాడింది మీరు కూడా ఇంట్లోనే ఉన్నారని చెప్పి నేను వచ్చాను

నేను లేచి వస్తుంటే ఉండమ్మా! అని సొంత కూతురికి పెట్టినట్లు వీటితో నా ఒడి నింపి అప్పుడప్పుడు వస్తుండమ్మా! అసలు నీ ఇల్లే అనుకో! అంది

మరో విషయం చెప్పటం మర్చానండీ! వచ్చే ఆదివారం మన ఇద్దరికీ వారింట్లోనే భోజనం మరీ గట్టిగా చెప్పారు పిన్నిగారు!

అంతా విన్న సూర్యం నుదిటిపై చెమటను తుడుచుకున్నాడు

ఇంతలో ఎదురింటి ముందు స్కూటరు ఆగిన చప్పుడయి సూర్యం దృష్టి అటుగా మరల్చాడు శంకరరావు ఇటుకేసి లిప్తకాలం చూసి ఆ తర్వాత ఇంటిలోకి వెళ్ళాడు

శంకరరావు చూపుల్లో ఎంత అంతర్యం మమత దాగున్నాయో గ్రహించాడు సూర్యం □